# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 10 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ప్రధాని మోడీకి నమీబియా అత్యున్నత పురస్కారం

- ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్విట్చియా మిరాబిలిస్ బహూకరణ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



నమీబియాలోని విండ్‌హెూక్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోడీకి అత్యున్నత పురస్కారం లభించింది. నమీబియా అధ్యక్షురాలు నేతుంబో నంది-న్డైట్వాహ్ చేతుల మీదుగా నమీబియా అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్విట్చియా మిరాబిలిస్'ను మోడీకి ప్రదానం చేశారు. కాగా భారత్.. నమీబియా దేశాలు పలు కీలక ఒప్పందాలు చేసుకున్నాయి.

# యూరియా కొరత రావొద్దు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలంగాణ అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎరువుల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశా రు.202324 రబీతో పోలిస్తే 202425లో 21శాతంఅదనం గా యూరియా అమ్మకాలు జరిగాయని కేంద్రమంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం ఇప్పటి వరకు 12.4 శాతం అదనపు వినియోగం జరిగిందన్నారు. తెలంగాణలోని వివిధ జిల్లాల మధ్య ఎరువుల సమన్వయాన్ని చే స్తూ రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని అధికారులకు జేపీ నడ్డా సూచనలు చేశారు. దీంతో తెలంగాణ రాష్ట్ర రైతులకు ఊరట లభించింది.

మంగళవారం ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం కేంద్రమంత్రిని కలిసి రాష్ట్రానికి సరిపడా యూరియా, ఎరువులు సరఫరా చేయాలని కోరింది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూలై, ఆగష్టు నెలల్లో యూరియాను నిరాటంకంగా సరఫరా చేయాలని సిఎం విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తిపై స్పందించిన కేంద్ర మంత్రి నడ్డా రైతుల అవసరాలను తీర్చడానికి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణకు అవసరమైన మేరకు సరఫరా ఉండేలా చూసుకోవాలని ఎరువుల శాఖ అధికారులను ఆదేశించారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు మళ్లించకుండా, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సమానంగా ఎరువులు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి అధికారులకు సూచించారు. రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి, సేంద్రీయ, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కేంద్రం ప్రణామ్ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రోత్సాహకాలు అందిస్తుందని కేంద్రమంత్రి సిఎం రేవంత్‌తో పేర్కొన్నారు.

# నేను క్లబ్బులు, పబ్బులకు రాను

- సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



హైదరాబాద్: కెసిఆర్ ఏ తేదీ చెప్పినా ఆ రోజు అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కృష్ణా జలాలపై నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడురు. కెసిఆర్ సభకు వస్తా అంటే.. స్పీకర్ అనుమతితో నిపుణులను కూడా అసెంబ్లీకి ఆహ్వానిస్తామని సిఎం అన్నారు. కెసిఆర్ పాలనలో నిర్ణయాలపై, తమ పాలనలో నిర్ణయాలపై చర్చిద్దాం అని పిలుపునిచ్చారు. ఎలాంటి గందరగోళం లేకుండా సభ నిర్వహిస్తామని సభా నాయకుడిగా తాను హామీ ఇచ్చారు. ప్రశాంత వాతావరణంలో అర్థవంతమైన చర్చ నిర్వహిందామని పేర్కొన్నారు. తనను దయచేసి క్లబ్బులు, పబ్బులకు పిలవొద్దని.. తాను రానని సిఎం అన్నారు.

"చంద్రశేఖర్ రావు గారు.. మీరు అసెంబ్లీకి రావాలి" అని రేవంత్ పిలుపునిచ్చారు. కెసిఆర్ ఆరోగ్యం బాగుండాలని.. ఆయన ప్రజా జీవితంలో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కెసిఆర్ ప్రజలకు ఉపయోగపడాలని తాను అనుకుంటున్నానని.. కానీ తన తండ్రితో ఏ ఉపయోగం లేదని కెటిఆర్ అంటున్నారని ఎద్దేవా చేశారు. నేపాల్‌లోనూ ఓ యువరాజు కుటుంబంలో అందరినీ చంపి రాజయ్యాడని తెలిపారు. కెసిఆర్ కుటుంబంలో సమస్య ఉంటే కూర్చొని మాట్లాడుకోవాలని అన్నారు. కుల పెద్దలతో, పెద్ద మనుషులతో మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని హితవు పలికారు.

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాల వల్ల రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లిందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. "కృష్ణా జలాల అంశంపై ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లోనే చర్చించేందుకు నేను సిద్ధం. కేసీఆర్ తేదీ నిర్ణయిస్తే చాలు" అని స్పష్టం చేశారు. అసెంబ్లీకి రావాలని సూచించానేమోగానీ, సవాల్ చేయలేదని పేర్కొన్నారు. "తాను సీనియర్ కాబట్టి, నేనే ఆయన వద్దకు వస్తా" అంటూ రాజకీయ మర్యాద కాపాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్, "ఎర్రవల్లిలోనే మాక్ అసెంబ్లీ పెట్టుకుందాం. నీటి ప్రాజెక్టులపై ప్రశాంతంగా చర్చించుకుందాం" అని అన్నారు. గోదావరి, కృష్ణా, పెన్నా బేసిన్లలో నీటిని తరలించవచ్చని చెప్పినప్పటికీ, కేసీఆర్ ప్రభుత్వం ఏపీతో అనుసంధానంతో తీరని నష్టాలు కలిగించిందని ఆరోపించారు. టెండర్లు, జీవోలు, సూచనల విషయంలో జగన్‌కు సహకరించడం వల్లే తెలంగాణ నీళ్లకు నష్టం వాటిల్లిందని వివరించారు. "తెలంగాణ హక్కులు, జలాలను ఏపీకి తాకట్టు పెట్టారు" అంటూ తెలుగుదేశం, వైసీపీ కన్నా కేసీఆర్ వల్లే ఎక్కువ ద్రోహం జరిగిందని ఆరోపించారు.

జూరాల నుంచే నీళ్లు ఒడిసి పట్టుంటే, ఏపీ తరలించే అవకాశం ఉండేది కాదని, కానీ గత ప్రభుత్వం అలా చేయలేదని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి, నల్గొండ తదితర ప్రాంతాలకు నీళ్లు తరలించాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తిగా పక్కనపెట్టి 3.64 లక్షల ఎకరాలకు సాగునీరు తాకలేదని, తగిన ప్రణాళిక లేకపోవడం వల్లే నష్టం జరిగిందని చెప్పారు.

## ఎప్‌సెట్ వెబ్‌ఆప్షన్ల నమోదుకు నేడే ఆఖరు

- ధ్రువపత్రాల పరిశీలనకు 95,216 మంది హాజరు : సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా వెబ్‌ఆప్షన్ల నమోదుకు తుది గడువు గురువారంతో ముగియనుంది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 95,216 మంది అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని తెలిపారు. 74,542 మంది అభ్యర్థులు 39,54,951 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. ఒక అభ్యర్థి ఎక్కువగా 1,051 ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. ఈనెల పదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు గడువుందని తెలిపారు. ఈనెల 13న మాక్ కౌన్సెలింగ్‌లో భాగంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. అదేనెల 14,15 తేదీల్లో వెబ్‌ఆప్షన్ల మార్పు, చేర్పులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఒకవేళ మార్పులు చేయకుంటే వాటినే మొదటివిడత వెబ్‌ఆప్షన్లుగా పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈనెల 18న ఎప్‌సెట్ తొలివిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. అదేనెల 18 నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

# రాష్ట్రాభివృద్ధికి కలిసిరావాలి

**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పారిశ్రామికవేత్తలు తెలంగాణ రాష్ట్రాభివృద్ధిలో కలిసిరావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడలో కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ)నిర్వహించిన చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. "రాష్ట్రంలో నైపుణ్యం ఉన్న కార్మికులు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువ ధరకు లభిస్తారు, చక్కటి వాతావరణం, కాలుష్య రహితం, 24 గంటలు నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉంది. నైపుణ్యం ఉన్న మానవ వనరులను సృష్టించడమే లక్ష్యంగా రాష్ట్రంలోని 100 ఐటిఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చాం. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు అదనంగా త్వరలో ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ )అందుబాటులోకి రాబోతోంది. ఔటర్ రింగ్ రోడ్డు ఫలితాలను మనం చూశాం, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీజనల్ రింగ్ రోడ్డుతో ఫార్మా, ఐటీ కంపెనీలతోపాటు హౌసింగ్, అగ్రికల్చర్, హ్యాండ్లూమ్స్ వంటి అనేక రకాల పారిశ్రామిక క్లస్టర్ల నిర్మాణం జరుగుతున్నాయి. లండన్‌లోనీ థేమ్స్ నదిలా హైదరాబాద్‌లో మూసీని పారించేందుకు మూసీ పునర్జీవం చేపట్టాం" ఈ అవకాశాలను పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని భట్టి విజ్ఞప్తి చేశారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, అనలిటిక్స్, ఆటోమేషన్ లాంటి సాంకేతికత ప్రపంచ గతిని మారుస్తోందని అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం, సమానత్వం, సమగ్రతలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో ఎన్నో కీలక కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. అన్ని వర్గాల విద్యార్థులకు సమానమైన, నాణ్యమైన విద్యను అందించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎన్నికల ముందిచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ కింద రూ.21 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన బ్యాంకులకు చెల్లించిందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ఏటా రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించాలని నిర్ణయించినట్టు భట్టి వివరించారు. ఈ సదస్సు ద్వారా జరిపే చర్చలు రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ నిర్వాహకులు శేఖర్‌రెడ్డి, శివ ప్రసాద్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నరసింహం, గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ హక్కులను

# ఎవ్వరికీ తాకట్టు పెట్టం

- తెలంగాణ హక్కుల కోసం దేవుడినైనా ఎదుర్కొంటాం
- సీఎం రేవంత్ రెడ్డి
- జలవివాదాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ జ్యోతిరావు పులే ప్రజాభవన్‌లో ఉత్తమ్ కుమార్ రెడ్డి సమగ్ర వివరాలు
- నీటి అంశంపై శాసనసభలో చర్చకు సిద్ధత పాలసీ డాక్యుమెంట్‌తో చర్చకు ప్రభుత్వ అంగీకారం
- రాయలసీమకు నీరు తరలింపు వల్ల విద్యుత్ కేంద్రాల పనితీరుపై ప్రభావం




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

'కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ హక్కులను ఎవ్వరికీ తాకట్టు పెట్టం. ఎంతటి వారొచ్చినా నిటారుగా నిలబడి కొట్లాడుతం. దేవుడే ఎదురుగా వచ్చి నిలబడినా ఎదురించి ప్రజలకు అండగా నిలబడుతాం. తెలంగాణ ప్రజల్లో శాశ్వతంగా, గొప్పగా నిలిచిపోయే విధంగా మా విధానం ఉంటుంది. ప్రజల హక్కులను తాకట్టు పెట్టం.." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ప్రజలు ఒక విశ్వాసం, నమ్మకంతో మాకు అవకాశం ఇచ్చారు. తెలంగాణ ప్రజల హక్కుల విషయంలో దేవుడే వచ్చి ఎదురుగా నిలబడినా దేవుడినైనా ఎదురించి తెలంగాణ ప్రజల తరపున నిలబడుతం. కృష్ణా, గోదావరి జిలాల్లో తెలంగాణ హక్కుల విషయంలో ఎవ్వరూ అధైర్య పడొద్దు అని భరోసానిచ్చారు. కృష్ణా, గోదావరి నదీ జలాలు : వినియోగం : వివాదాలు అన్న అంశంపై జరిగిన, జరుగుతున్న పరిణామాలపై జ్యోతీరావు పూలె ప్రజా భవన్‌లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై గత ప్రభుత్వంలో జరిగిన పరిణామాలతో పాటు ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు ప్రాధాన్యత, దాన్ని తర్వాత క్రమంలో తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు స్థల మార్పు, తదనంతర పరిణామాలపై మంత్రి గారు మరో ప్రజెంటేషన్ రూపంలో సమగ్రంగా వివరించారు. మేడిగడ్డలో నీటిని నిలువ చేస్తే ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలోని అంశాలను విడమరిచి చెప్పారు.

అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో జరిగిన, జరుగుతున్న పరిణామాలపై శాసనసభలో అర్థవంతమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. నదీ జలాల కేటాయింపుల్లో తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వం తీసుకోబోయే చర్యలపై పాలసీ డాక్యుమెంట్‌ను సభ ముందు అందజేస్తామని చెప్పారు. స్పీకర్ అనుమతితో నీటి పారుదల రంగ నిపుణులు, న్యాయ శాఖ నిపుణులు, స్టేక్ హెూల్డర్స్ అందరినీ ఆహ్వానించి ఒక మంచి సానుకూల వాతావరణంలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ శాశ్వత హక్కులను కాపాడుకోవడం కోసం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు వాస్తవాలు చేరవేయడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. వరద జలాలను వినియోగించుకుంటామని ఆంధ్రప్రదేశ్ వాదనను ముఖ్యమంత్రి తోసిపుచ్చారు. ముందు నికర జలాల్లో వాటా తేలాలన్నారు. నికర జలాల్లో వాటా తేలిన తర్వాత మిగులు, వరద జలాల్లో ప్రొరేటా ప్రకారం ఇరు రాష్ట్రాలకు కేటాయింపులు జరగాలన్నారు. "నీటి వాటాలో తెలంగాణ హక్కుల కోసం సంబంధిత సంస్థలు, కేంద్ర ప్రభుత్వం ముందు వాదనలు వినిపించడమే కాకుండా న్యాయస్థానాల్లో పోరాడుతున్నాం. ఈ విషయంలో నీటి పారుదల శాఖ మంత్రి గారు స్వయంగా సమన్వయం చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే నీటి వాటాలో రాష్ట్ర హక్కులు దక్కేవి. హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కూడా నివశిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరానికి ఉమ్మడి కోటా కింద నీటి వాటా కోరి ఉంటే ఈరోజు పరిస్థితి కొంత భిన్నంగా ఉండేది. తెలంగాణ నీటిని రాయలసీమకు తరలించడం వల్ల శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పనికిరాకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. ఈ రకంగా తక్కువ ధరకు లభించే విద్యుత్ విషయంలోనూ అన్యాయం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన కల్వకుర్తికి నీటి కేటాయింపులను పూర్తి చేయలేదు. బీమా, నెట్టెంపాడు, నల్గొండకు గ్రావిటీతో తీసుకెళ్లే ఎస్ఎల్ బీసీ పూర్తి చేయలేదు. ఏ ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయని కారణంగా తెలంగాణకు అన్యాయం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో గోదావరి నదిపై 2007-08 లో ప్రాణిహిత చేవెళ్ల (డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సుజల స్రవంతి) ప్రాజెక్టు తుమ్మిడిహెట్టి నుంచి ప్రాంతాన్ని, అంచనాలను, పేరును మార్చడమే కాకుండా బేసిన్ల సాకుతో రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోని ఆయకట్టును తొలగించడం వల్ల నష్టం జరిగింది. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ప్రభుత్వం 54 లక్షల ఎకరాలకు నీరిస్తే, ఎకరాకు 93 వేల రూపాయలు ఖర్చయింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం 15 లక్షల ఎకరాలకు నీరు ఇస్తే, ఎకరాకు 11.47 లక్షల రూపాయలు ఖర్చు చేసింది. ఇలా ప్రతి విషయంలోనూ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉంది. నీటి వాటాలకు సంబంధించిన అంశాలపై జరిగిన, జరుగుతున్న పరిణామాలపై సమగ్రమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది" అని ముఖ్యమంత్రి గారు పేర్కొన్నారు. వాస్తవాల ప్రాతిపదికన ఒక నివేదికను అందించారని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి ముఖ్యమంత్రి గారు అభినందనలు తెలియజేశారు.

## మసి పూసి మారేడు కాయ చేస్తే నిజాలు దాగవు

- మాజీ మంత్రి హరీశ్ రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

'మసి పూసి మారేడు కాయ చేస్తే నిజాలు దాగవని ప్రజలెప్పుడో తెలుసుకున్నారు. మేడిగడ్డను పడావు పెట్టి, నీళ్ల కిందకు వదిలి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నాడు" అని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనలు ఉన్నప్పటికీ, రిపేర్ పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా.. ప్రభుత్వ అలసత్వం వల్లే రైతులకు నీటి సమస్య తలెత్తుతుందని విమర్శించారు. గతంలో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును స్థల మార్పు చేసి నష్టపరిచారని, ఇప్పుడు మేడిగడ్డను సైతం నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు.

రైతు ప్రయోజనాల కంటే అధికారుల రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ పై వాహనాల రాక అనుమతిస్తున్నారు.. అంటే అది కూలిపోయినట్లా? లేక నన్ను మభ్యపెట్టే నాటకమా? అని ప్రశ్నించారు. "299:512 వాటా కాంగ్రెస్‌దే.. ఇప్పుడు దానికి తెలంగాణ శిక్ష అనుభవిస్తోంది" కృష్ణా జలాల్లో రాష్ట్రానికి తక్కువ వాటా (299:512) అందినదంతా కాంగ్రెస్ చేసిన ఒప్పందమేనని, ఇప్పటికీ తెలంగాణ ప్రజలు ఆ ద్రోహానికి మూల్యం చెల్లిస్తున్నారని వ్యాఖ్యానించారు.

"ఎవర్ని కొరడా దెబ్బలు కొట్టాలి?" అంటూ వ్యాఖ్యానించిన హరీశ్, కాంగ్రెస్ నాయకులే గోదావరి, కృష్ణా జలాలను ఆంధ్రాకు అప్పజెప్పిన వాస్తవాలను ప్రజలు మరిచిపోరని గుర్తు చేశారు. ప్రత్యక్షంగా ప్రధాన ప్రతిపక్షాన్ని పిలవకపోవడం ప్రజాస్వామ్య అవమానం ప్రజాభవన్‌లో జరిగిన అధికారిక నీటి సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పిలవకపోవడాన్ని ప్రజాస్వామ్యానికి తూటాను అని అభివర్ణించారు. ఇది ఎమ్మెల్యేల ప్రివిలేజ్‌కు భంగం కల్పించడమేనని పేర్కొన్నారు. దీనిపై శాసనసభ స్పీకర్‌కు బీఆర్ఎస్ పార్టీ ప్రివిలేజ్ మోషన్ ఇవ్వనుందని తెలిపారు.

## 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్

**4,090 ఎంబీబీఎస్ సీట్లు యధాతథం**

**రాష్ట్ర వైద్యారోగ్యశాఖకు ప్రశంసలు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రాష్ట్రంలో 4,090 ఎంబీబీఎస్ సీట్లు ఈ ఏడాది కూడా కొనసాగనున్నాయి. మెడికల్ కాలేజీల తనిఖీ సందర్భంగా బోధనా సిబ్బంది కొరతను గుర్తించిన ఎన్ఎంసీ ఫ్యాకల్టీ కొరతను అధిగమించేందుకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ తీసుకుంటున్న చర్యలను ప్రశంసించింది. ఇటీవల ఫ్యాకల్టీ కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం టీచింగ్ ఫ్యాకల్టీకి పెద్ద సంఖ్యలో పదోన్నతులు కల్పించింది. 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు, అడిషనల్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లుగా ప్రమోషన్లు ఇస్తూ వారందరికీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌గా, టీచింగ్ హాస్పిటళ్లకు సూపరింటెండెంట్లుగా నియమించింది. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 278 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతులు

## గుజరాత్‌లో కూలిన వంతెన

**10మంది మృతి**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గుజరాత్‌లోని వదోదరలో బుధవారం తెల్లవారుజామున వంతెన కూలిన ప్రమాదంలో 10 మంది మృతి చెందారు. మరో ఆరుగురిని కాపాడారు. ఈ విషయాన్ని గుజరాత్ హెూంమంత్రి సంఘ్వీ వెల్లడించారు. పద్రా వద్ద మహిసాగర్ నదిపై ఉన్న గంభీర వంతెన కూలటంతో నాలుగు వాహనాలు నదిలో పడ్డాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సహా వివిధ శాఖల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గల్లంతైన మరికొందరి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వదోదర-ఆనంద్ పట్టణాలను కలిపే గంభీర వంతెన కూలటంతో ఆ రెండు పట్టణాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుజరాత్ నుంచి సౌరాష్ట్రకు వెళ్లే వాహనాలకు ఈ వంతెన ప్రధాన మార్గంగా ఉంది. సరైన మరమ్మతులు లేకపోవడం వల్లే వంతెన కూలినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. బుధవారం తెల్లవారుజామున వంతెన కూలిన సమాచారాన్ని స్థానికులు అగ్నిమాపక దళం, రెస్క్యూ బందానికి అందించారు. అగ్నిమాపక శాఖ, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు వెంటనే రంగంలోకి దిగాయి. ముగ్గురిని నది నుంచి సజీవంగా బయటకు తీశారు. ఇప్పటి వరకు ఆరు మృత దేహాలను గుర్తించగా, మరికొందరు నదీ గర్భంలో చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో అనేక వాహనాలు వంతెన మీదుగా వెళుతున్నాయని స్థానికులు చెప్పారు. వదోదర, ఆనంద్ జిల్లాల అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

## మహిళపై సామూహిక లైంగికదాడి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ముగ్గురు వ్యక్తులు ఒక మహిళపై లైంగికదాడికి పాల్పడ్డారు. డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయాలని బలవంతం చేశారు. ఆమె మొబైల్ ఫోన్ లాక్కున్నారు. ఆ తర్వాత ఇంట్లో ఉన్న ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ చోరీ చేశారు. బాధిత మహిళ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. పరప్పన అగ్రహార ప్రాంతం సమీపంలో ఒక మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రెండు రోజుల కిందట స్నేహితుడు, మరో ఇద్దరు వ్యక్తులు కలిసి తనపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపించింది. తనను బెదిరించి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారని, బెట్టింగ్ యాప్‌లో పందెం కోసం వినియోగించారని ఫిర్యాదులో పేర్కొంది. తన మొబైల్ ఫోన్ లాక్కున్నారని, అలాగే తన ఇంట్లోని ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ ఎత్తుకెళ్లారని ఆరోపించింది. కాగా, ఆ మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. అయితే ఆమె ఆరోపణల్లో నిజానిజాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కొంతమంది అనుమానితులను ప్రశ్నిస్తున్నట్లు వెల్లడించారు.



## కుప్పకూలిన ఐఏఎఫ్ జాగ్వార్ జెట్..ఇద్దరు పైలట్ల మృతి,

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాజస్థాన్ లోని చురు జిల్లాలో భానుడా గ్రామ సమీపంలో భారతవైమానిక దళానికి చెందిన జాగ్వార్ ఫైలెట్ జెట్ కూలి, ఇద్దరు ఫైలెట్లు మరణించారు. ఐదు నెలల్లో జాగ్వార్ యుద్ధ విమానాలు కూలిన మూడో సంఘటన ఇది. విమానం పంటపొలాల్లో కూలిపోవడంతో ధ్వంసమైంది. తీవ్రంగా దెబ్బతిన్న స్థితిలో ఇద్దరు ఫైలెట్ల మృతదేహాలను కనుగొన్నారు. బుధవారం మధ్యాహ్నం 1:32 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. జాగ్వార్ ప్రమాదాన్ని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ధృవీకరించింది. రాజస్థాన్ లోని చురు సమీపంలో సాధారణ శిక్షణ కార్యక్రమంలో భాగంగా వెళ్తున్న ఐఏఎఫ్ జాగ్వార్ శిక్షణ విమానం ప్రమాదవశాత్తూ కుప్పకూలిందని ఇద్దరు ఫైలట్లు మరణించారని, పౌర ఆస్తికి ఎలాంటి నష్టం కలుగలేదని ఐఏఎఫ్

తెలిపింది. ప్రమాద కారణాలను కనుగొనేందుకు కోర్ట్ ఆఫ్ ఎంక్వయిరీకి ఆదేశించింది. ప్రమాదం వల్ల మరణించిన ఫైలట్ల కుటుంబాలకు అండగా నిలుస్తామని ప్రకటించింది. రాజస్థాన్ లో ఐఏఎఫ్ పలు వైమానిక స్థావరాలను నిర్వహిస్తోంది. జోధ్ పూర్, బికనీర్ లో ప్రధాన స్థావరాలు ఉన్నాయి. పంటపొలాల్లో జాగ్వార్ ఫైలెట్ జెట్ పెద్ద శబ్దంతో కుప్పకూలడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వారే పరుగుపరుగున ప్రమాద స్థలానికి వచ్చి మంటలను ఆర్పేయత్నం చేశారు.ఐదు నెలల్లో కుప్పకూలిన ఐదో జాగ్వార్ జెట్ ఇది. మార్చ్ 7న అంబాలాలో టేకాఫ్ అయిన కొద్ది సేపటికే సాంకేతిక సమస్యతో జాగ్వార్ కూలిపోయింది. ఫైలెట్లు సురక్షితంగా బయటపడ్డారు. ఏప్రిల్ 2న గుజరాత్ లోని జామ్ నగర్ సమీపంలో జాగ్వార్ ట్విన్- సీటర్ ట్రైనర్ విమానం కూలిపోయింది. ఆ ప్రమాదంలో ఇద్దరు ఫైలెట్లలో ఒకరు చనిపోగా,మరొకరు ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఏడాది ఇప్పటివరకూ ఐఏఎఫ్ ఐదు ప్రమాదాలను చూసింది.

# జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇంటి స్థలాల కోసం కృషి చేస్తా..

- **టీయూడబ్ల్యూజే సభలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్**



**బలగం టీవీ, జగిత్యాల:**

జర్నలిస్టుల కష్టాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి గాను టీయూడబ్ల్యూజే సంఘానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హామీ ఇచ్చారు. బుధవారం నాడు జగిత్యాల పట్టణంలోని సుమంగళి ఫంక్షన్ హాలులో జరిగిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) జగిత్యాల జిల్లా తృతీయ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించే జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా టీయూడబ్ల్యూజే కోరుతున్న జర్నలిస్టుల హెల్త్ కార్డులు, ఇంటి స్థలాలు, ఇళ్ల మంజూరీకి తాను ప్రత్యేక కృషి చేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. జర్నలిస్టులకు, ప్రభుత్వానికి మధ్య స్నేహ పూర్వక సంబంధాలుంటేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ మాట్లాడుతూ, ఏ ప్రభుత్వం నుండి కూడా ఏనాడూ జర్నలిస్టులు గొంతెమ్మ కోరికలు ఆశించలేదని, కేవలం తమ జీవితాలకు భరోసాను ఆశించినట్లు ఆయన స్పష్టం చేసారు. వృత్తిలో మానసిక ఒత్తిళ్లకు గురయ్యే జర్నలిస్టుల కోసం ఆరోగ్య పథకాన్ని ప్రవేశ పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. అలాగే ఏళ్ళ తరబడి ఆర్థిక కష్టాల మధ్య దుర్భర జీవితాలు కొనసాగిస్తున్న జర్నలిస్టుల ఇంటి స్థలాలు, ఇళ్ల కోరికను తీర్చాలని విరాహత్ అలీ కోరారు.

ఇంకా ఈ సభలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్సీ ఎల్. రమణ, టీయుడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణ, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, మహారాష్ట్ర స్టేట్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు గుండారి శ్రీనివాస్, జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ వసంత, మాజీ మున్సిపల్ చైర్మన్ జ్యోతి, టీయుడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేందర్ కుమార్, ఎలగందుల రవీందర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్ లతో పాటు దాదాపు 400 మంది జర్నలిస్టులు హాజరయ్యారు.

# యువకులు గంజాయి కి బానిసై పెడదారి లో వెళ్ళవద్దు..

## మంచి దారిలో వెళితేనే మంచి భవిష్యత్తు ఉంటుంది..

## ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

చాలామంది యువకులు గంజాయి కి అలవాటు పడి వారి చదువును వదిలి వారి బంగారు భవిష్యత్తు ను పాడు చేసుకోవడం జరుగుతుందని ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ అన్నారు. యువకులు గంజాయి కి బానిసై పెడదారి లో వెళ్ళవద్దని సూచించారు. మంచి దారిలో వెళితేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఇల్లంతకుంట మండలం లోని పలు గ్రామాల్లో మరియు మండల కేంద్రంలో గంజాయి సరఫరా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే వర్షాలు గత కొన్ని రోజులుగా కురవడం వల్ల వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించడం మంచిదని, వర్షపు నీరు గుంతల్లో ఉండడం వలన గుంతలు ఏర్పడక పడి పోవడం వల్ల ప్రమాదాలు జరుగుతుంది. కాబట్టి తప్పకుండా హెల్మెట్ ధరించడం మంచిదని అలాగే తల్లి దండ్రులు తమ పిల్లలకు సెల్ ఫోన్ లు ఇవ్వకుండా చూసుకోవాలని కొంతమంది 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఫోన్లో ఆన్లైన్ యాప్ లు డౌన్లోడ్ చేసి బెట్టింగ్ లకు పాల్పడుతున్నారు అని అందుకే తల్లి దండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించి వారినీ చదువుకునే విధంగా చూసుకోవాలని అన్నారు.

ద్విచక్ర వాహనము లు ముక్యంగా మైనర్లకు ఇవ్వరాదని తప్పకుండా ఎవరైనా కూడా లైసెన్స్, ఇన్సూరెన్తో పాటు హెల్మెట్ ధరించి ఉండాలన్నారు. ఒకవేళ ప్రమాదం జరిగితే ఇవి అన్ని ఉన్న కూడా లైసెన్స్ లేకుంటే ఇన్సూరెన్ వర్తించదు కాబట్టి వాహనదారులు ఇవి అన్ని కలిగి ఉండాలని ప్రతి రోజు కూడా పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది, కాబట్టి ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామని, అలాగే ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం రెవెన్యూ శాఖ ద్వారా ఇసుక సరఫరా చేస్తుంది కాని కొంతమంది ట్రాక్టర్ల యాజమానులు వాటిని పక్కదారి పట్టించడం జరుగుతుంది అని మా దృష్టి కి రావడం జరిగిందని ఎవరైనా పట్టుబడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

# 10,000 పీఎస్ హెడ్మాస్టర్ పోస్టులు మంజూరు చేయాలి..

- **సమాన అర్హతగా పరిగణించాలి..**
- **ప్రాథమిక పాఠశాలలో రేషనలైజేషన్ నిబంధనలు మార్చాలి**
- **టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు దుమాల రమానాథ్ రెడ్డి, విక్కుర్తి అంజయ్య డిమాండ్..**




**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల:**

టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ సమావేశం సిరిసిల్లలో మంగళవారం నిర్వహించడం జరిగింది . ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు దుమాల రమానాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇదివరకే ప్రకటించిన 10 వేల పీఎస్ పోస్టులు మంజూరు చేసి ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయ పోస్టు ఇవ్వాలని అన్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన పదివేల పోస్టులు ఇంతవరకు మంజూరు చేయలేదని వాటిని వెంటనే మంజూరు చేసి ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా పాఠశాలలను తీర్చిదిద్దాలని వారు డిమాండ్ చేశారు.ప్రాథమిక పాఠశాలలో విద్య బాగుంటేనే విద్యా రంగం అభివృద్ధి చెందుతుందని ప్రాథమిక స్థాయిని నిర్లక్ష్యం చేయడం వల్లనే ప్రభుత్వ విద్యా వ్యవస్థ తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటుందని వారు అన్నారు..అదే విధంగా బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూడా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్టు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ప్రాథమిక పాఠశాల లో రేషనలైజేషన్ పేరుతో ప్రాథమిక పాఠశాలను మూసివేసే కుట్ర జరుగుతుందని 60 మంది విద్యార్థులకు కూడా ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించడం వల్ల విద్యార్థుల అభ్యసన తీవ్రంగా నష్టపోతుందని అందువల్ల ప్రభుత్వం 20 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని 20 నుంచి 40 మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు ఉపాధ్యాయులను 40 విద్యార్థుల పైన ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా నిబంధనలను సవరించాలన్నారు.



# జర్నలిస్టు ప్రసాద్‌కు ఘన నివాళి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల**

సిరిసిల్ల నియోజకవర్గ టీవీ9 రిపోర్టర్ గర్దాస్ ప్రసాద్ కు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ, టెంజు ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు. మృతుడు గర్దాస్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం టీయుడబ్ల్యూజే 143 జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా, టెమ్జు అధ్యక్షులు ఇరుకుల ప్రవీణ్ మాట్లాడుతూ గర్దాస్ ప్రసాద్ మరణం జర్నలిస్టు సమాజానికి తీరని లోటు అన్నారు. కడు పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ప్రసాద్ కుటుంబ సభ్యులకు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి డబుల్ బెడ్ రూమ్ ను మంజూరు చేయాలని వారు కోరారు. మీడియా అకాడమీ నుండి మృతుని కుటుంబ సభ్యులకు సహాయ సహకార అందేలా యూనియన్ ప్రతినిధులు కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సామల గట్టు మహమ్మద్ అజీమ్ లతోపాటు, సీనియర్ పాత్రికేయులు రాపల్లి సంతోష్, సుకుమార్, పర్కల ప్రవీణ్, ప్రసాద్ రెడ్డి, తంగళ్లపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్, మోర శ్రీకాంత్ , రెడ్డి రాజశేఖర్, గద గోని సాగర్, మధు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# జర్నలిస్టు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి..

**మృతుడు ప్రసాద్ కుటుంబానికి టీయూడబ్ల్యూజే హెచ్ 143 అండగా ఉంటుంది..**

**సంతాప సభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన టీవీ9 రిపోర్టర్ గర్దాస్ ప్రసాద్ ఇటీవలే గుండెపో టుతో మృతి చెందారు. కడు పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న పేద జర్నలిస్టు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు లాయక్ పాషా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వేములవాడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం లాయక్ పాషా మాట్లాడుతూ జర్నలిజాన్ని వృత్తిగా ఎన్నుకొని జీవనాన్ని కొనసాగిస్తున్న ప్రసాద్ అకాల మరణం జర్నలిస్టులోకానికి తీరని లోటన్నారు. మృతుడు ప్రసాద్ కుటుంబాన్ని ప్రభుత్వం, టీవీ9 యాజమాన్యం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరారు. నిలువ నీడలేని ప్రసాద్ కుటుంబానికి డబుల్ బెడ్ రూమ్‌ను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీ ద్వారా తక్షణమే లక్ష రూపాయల సహాయం, మృతుడి భార్యకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. మృతుడి కుటుంబానికి తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అల్లం నారాయణ, మారుతి సాగర్ ల ఆధ్వర్యంలో అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మొహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు రేగుల రాము, టెంజు జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి జితేందర్ రావు లతో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలి

**బలగం టీవీ, వీణవంక**



తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన అంటే మహిళలకే ఉచిత బస్సు ప్రయాణం కాదని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ కమిటీ సభ్యులు బుధవారం తహసీల్దార్ రజితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 వేలకు పైగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో 22 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని, వీరిలో 90 శాతం విద్యార్థులు వారు చదువుకుంటున్న పాఠశాలలకు దూరంగా నివాసం ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ 30 మంది విద్యార్థులకు ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేసి, విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా సమయం, శక్తి వృథాకాకుండా ఉంటుందని, చదువుపై మరింత శ్రద్ధ పెడతారని పేర్కొన్నారు. ఈ డిమాండ్‌ను నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో, మండలాల్లో ధర్నాలు, రాస్తారోఖోలు, నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ వీణవంక మండల కమిటీ సభ్యులు బీ వీరస్వామి, గణేష్, తిరుపతి, శ్రీనివాస్, సాయికుమార్, మహంకాళి రమేష్, గాజుల కుమార్, పృథ్వీరాజ్, సదానందం, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ బయోమెట్రిక్ అప్ డేట్ చేసుకోవాలి..



- అదనంగా సి.ఎస్.సి సెంటర్ల ఏర్పాటు నోటిఫికేషన్ జారీ చేయాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డ్ లో వివరాలు, బయోమెట్రిక్ అప్ డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎస్పీ మహేష్ బి గీతే తో కలిసి జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, సంతృప్త పద్ధతిలో పౌరులందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే ప్రసవాల వివరాలు ఈ బర్త్ పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు.

ప్రతి 10 వేల జనాభాకు ఒక సి.ఎస్.సి సెంటర్ ఏర్పాటు చేయాలని, 7 రోజుల సమయంలో అదనంగా మరో 36 సి.ఎస్.సి సెంటర్ల ఏర్పాటు నోటిఫికేషన్ జారీ చేయాలని, ప్రస్తుతం ఉన్న కొన్ని సెంటర్లు మార్చాలని అన్నారు. జిల్లాలో 5 నుంచి 15 సంవత్సరాల లోపు గల 27 వేల పైగా ఉన్న జనాభాకు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేయించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ అప్ డేషన్ కోసం ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్, కాలేజీ లలో ప్రత్యేక అవగాహన క్యాంపులను ప్రతి 6 నెలలకు ఒకసారి ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా సంక్షేమ అధికారి 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఆధార్ కార్డు అందేలా చూడాలని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారి ఆదార్ నమోదుకు సంబంధించి తహసిల్దార్ లాగిన్ లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. మండల కేంద్రాలలో ఆధార్ కార్డు వివరాల అప్ డేట్ చేసేందుకు ప్రత్యేక క్యాంపుల ఏర్పాటు ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. జిల్లాలో మీ సేవా కేంద్రాల్లో ఆధార్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పోస్టల్ కార్యాలయం నుంచి ఎన్ని ఆధార్ కార్డు తప్పుడు అడ్రెస్ ల కారణంగా వెనక్కి వచ్చాయో వివరాలు అందించాలని అన్నారు.జిల్లాలోని వివిధ అనాథ శరణాలయాల్లో పెరుగుతున్న వారికి ఆధార్ ఎన్?రోల్?మెంట్? లో వచ్చే సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో యూ.ఐ.డి.ఏ.ఐ ప్రాజెక్టు మేనేజర్ నరేష్ చంద్ర,జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.రజిత, ఈ.డి.ఎం. శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బోనాల మహోత్సవానికి హాజరైన చల్మెడ..

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ పట్టణానికి చెందిన టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ – మైసమ్మ తల్లి అమ్మవార్లకు ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ మహోత్సవానికి బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ వారు బోనాల మహోత్సవం నిర్వహించడం చాలా శుభప్రదం అని పేర్కొన్నారు. వారి వ్యాపారాలు, కుటుంబాలు మంచిగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నామని తెలిపారు. ఈ వేడుకలో మాజీ సెస్ డైరెక్టర్లు రామతీర్థపు రాజు, గజానంద రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, నరాల



శేఖర్, గోలి మహేష్, జోగిని శంకర్, ముద్రకోల వెంకటేశం, నాయకులు నరాల దేవేందర్, నీలం శేఖర్, కొండ కనకయ్య, కొండ నర్సయ్య, వాసాల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, మల్లేశం, సుంకపాక రాజు, రాజేందర్, గోస్కుల రవి, మాడిశెట్టి కృపాల్, మంతె సందీప్, రాకేష్, బియ్యాల ప్రమోద్, డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షులు వాసాల మధుసుదన్, ఉపాధ్యక్షులు వెంకటేష్, సభ్యులు తదితరులు ఉన్నారు.

# బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి..

- విద్యాలయాలు, లో లెవెల్ బ్రిడ్జిల పరిశీలన
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ, బోయినిపల్లి:**



వేములవాడ – బోయినిపల్లి దారిలో స్తంభంపల్లి గ్రామ శివారులో బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బోయినిపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామ శివారులో అసంపూర్తిగా నిలిచిన బ్రిడ్జి పనులను వారు బుధవారం కలిసి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని కాంట్రాక్టర్ కు సూచించారు. పనులు వేగవంతం చేసి, నిరంతరం పర్యవేక్షించాలని పంచాయితీ రాజ్ ఈఈ సుదర్శన్ రెడ్డిని ఆదేశించారు.

### తరగతి గదులు నిర్మించాలి..

బోయినిపల్లి మండల కేంద్రంలోని కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. పదవ తరగతి గదిని సందర్శించి, విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కిచెన్, స్టోర్ రూమ్, మధ్యాహ్న భోజనం తయారీ తీరును పరిశీలించారు. విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలని సూచించారు. భవనం మొదటి అంతస్తులో రూ. 8 లక్షలతో రెండు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయితీ రాజ్ ఈఈ ని ఆదేశించారు.

### ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు..

బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. చదువుతున్న విద్యార్థుల సంఖ్య, వివరాలపై ఆరా తీశారు. విద్యార్థుల నమోదు పెంచేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అంగన్వాడీ లో చిన్నారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోయినిపల్లి %–% కొదురుపాక దారిలో ఉన్న రెండు లో లెవల్ కల్వర్టులను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహిస్తూ, పిచ్చి మొక్కలను తొలగించాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈ.ఈ. పీ.ఆర్. సుదర్శన్ రెడ్డి, ఎంపీడీఓ జయశీల, తహశీల్దార్ నారాయణ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## అట్టహాసంగా శ్రీరామ పాదుక పట్టాభిషేకం..

- భారీగా తరలివచ్చిన మహిళలు

**బలగం టీవి, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వరదవెల్లి గ్రామంలో గత 70 రోజులుగా రామాయణ ప్రవచనాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా చివరి రోజు శ్రీరామ పాదుక పట్టాభిషేక మహోత్సవం అట్టహాసంగా నిర్వహించగా, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి, తమ భక్తిని చాటారు. శ్రీరామ పాదుకల ఊరేగింపులో ఊరు– ఊరంతా మహిళలు తరలివచ్చి, మంగళ హారతులతో స్వాగతం పలుకుతూ, స్థానిక హనుమాన్ దేవాలయంకు చేరుకొని ఆలయ ఆవరణలో పట్టాభిషేక క్రతువు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



## రైతు బజార్ ను వినియోగించుకోవాలి..

- కలెక్టర్ ఆదేశాలతో కూరగాయల వ్యాపారులకు షెడ్ల నిర్మాణం
- కూరగాయలు, మాంసం, చేపల షాపులు తరలింపు
- జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం

**బలగం టీవి, సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలోని బతుకమ్మ ఘాట్ రైతు బజార్ ను కూరగాయలు, మాంసం, చేపల విక్రయదారులు వినియోగించు కోవాలని బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కూరగాయల వ్యాపారులను బతుకమ్మ ఘాట్ రైతు బజార్ లోకి తరలించేందుకు అవసరమైన షెడ్ల నిర్మాణం చేస్తున్నామని, అదేవిధంగా ఈ రైతు బజార్ లోకి మటన్ షాపులు, మాంసం షాప్ లు, చేపల విక్రయం షాపులు సైతం తరలించాలని, ఎవరు కూడా రోడ్డు పక్కన అమ్మకూడదని అన్నారు. బతుకమ్మ ఘాట్ రైతు బజార్ ను జిల్లాలోని వినియోగదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి వాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఈ ప్రకటనలో పేర్కొన్నారు.



## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలి..

**ఇల్లంతకుంట ఎస్ఐ సిరిసిల్ల అశోక్**

**దుస్తులు పంపిణీ చేసిన శ్రీనివాస్ ను అభినందించిన ఎస్ఐ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలని ఇల్లంతకుంట ఎస్ఐ సిరిసిల్ల అశోక్ అన్నారు. ఇల్లంతకుంట మండలం లోని రహీంఖాన్ పేట గ్రామంలో ఆదర్శ పాఠశాలలో క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో క్రీడాకారులకు రహీంఖాన్ పేట గ్రామానికి చెందిన గడ్డమీది శ్రీనివాస్ క్రీడా దుస్తులను పంపిణి చేయడం జరిగింది. విద్యార్థులకు క్రీడలు కాకుండా మరే సహాయం కావాలన్న నేను ముందుంట ఆయన తెలిపారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. పిల్లలకు క్రీడాలతో మానసిక ఉల్లాసం తో పాటు మంచి భవిష్యత్ ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, పిటి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, నాయకులు, గుండా పర్శరాం, బొల్లం రవి, నాగుల సాయి ప్రసాద్, గుడిసె శేఖర్, జెట్టి అజయ్, గుడిసె అభి, పల్లె వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఆరో స్థానానికి శుభ్‌మన్ గిల్

బలగం టీవీ, హైదరాబాద్ : ఇటీవలే భారత టెస్టు జట్టుకు సారథిగా ఎంపికై ఇంగ్లండ్ పర్యటనలో పరుగుల వరద పారిస్తున్న శుభ్‌మన్ గిల్.. ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ సత్తాచాటాడు. తాజాగా విడుదలైన టెస్టు బ్యాటింగ్ ర్యాంకులలో ఏకంగా 25 స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి దూసుకొచ్చాడు. హెడింగ్లీలో శతకంతో పాటు ఎడ్జ్‌బాస్టన్‌లో రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీల మోత మోగించిన గిల్.. 807 రేటింగ్ పాయింట్లతో స్టీవ్ స్మిత్ (5) తర్వాతి స్థానంలో నిలిచాడు. ఇక భారత్‌తో సిరీస్‌లో రాణిస్తున్న ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్.. 886 పాయింట్లతో రూట్‌ను అధిగమించి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు.




# హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు అరెస్ట్

- **సన్‌రైజర్స్ ఫ్రాంచైజీని బెదిరించినట్టు ఆరోపణలపై సీఐడీ చర్య**

బలగం టీవీ, హైదరాబాద్

ఐపీఎల్ 2025 సీజన్ టికెట్ల వివాదం కేసులో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావును తెలంగాణ సీఐడీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అతనితో పాటు హెచ్‌సీఏకి చెందిన మరికొంత మంది సభ్యులను కూడా అదుపులోకి తీసుకున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ నుండి అదనపు టికెట్ల కోసం బెదిరింపులు చేశారన్న ఆరోపణలపై విజిలెన్స్ శాఖ చేసిన సిఫార్సుల ఆధారంగా ఈ అరెస్టులు జరిగినట్లు సీఐడీ అధికారులు వెల్లడించారు. ప్రతీ ఐపీఎల్ సీజన్‌కి 10 శాతం కాంప్లిమెంటరీ టికెట్లు ఇచ్చే ఆనవాయితీ కొనసాగుతున్నప్పటికీ, ఈ సారి మరిన్ని టికెట్లు (మరో 20 శాతం) ఇవ్వాలని జగన్‌మోహన్ రావు బెదిరించాడని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం అధికారిక లేఖ ద్వారా తెలిపింది. తనకు వ్యక్తిగతంగా 10 శాతం టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు ఆ లేఖలో పేర్కొంది. ఈ లేఖ లీకవడంతో వివాదం తీవ్ర రూపం దాల్చింది. వీఐపీ కార్పొరేట్ బాక్స్ తాళం వేయడం, మ్యాచ్ నిర్వహణకు ఆటంకాలు కలిగించడం వంటి ఘటనలపై సన్‌రైజర్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. "ఈ తరహా చర్యలు మళ్లీ కొనసాగితే హైదరాబాద్ నుంచి వెళ్లిపోవడం తప్పదు" అని హెచ్చరించింది. ఈ వివాదంపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించగా, వచ్చిన నివేదికలో అభియోగాలు వాస్తవమేనని తేలింది. దీంతో ప్రభుత్వం ఆదేశాలతో సీఐడీ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చర్యలు చేపట్టారు. ఈ కేసు నేపథ్యంలో హెచ్‌సీఏ వ్యవహారశైలిపై మరోసారి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి, అనైతిక ఒత్తిళ్లు సంస్థ ప్రతిష్టను దిగజార్చుతున్నాయని క్రీడాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




# 'బ్యాడ్ గర్ల్' విడుదలకు సెన్సార్ బోర్డు ఓకే

బలగం టీవీ, హైదరాబాద్

తమిళం నుంచి వస్తున్న వివాదాస్పద చిత్రం బ్యాడ్ గర్ల్. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్, కోలీవుడ్ డైరెక్టర్ వెట్రిమారన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి శివరామన్ కథానాయికగా నటిస్తుంది. వర్షా భరత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా విడుదలకు సెన్సార్ పలు అడ్డంకులు తెలిపిన విషయం తెలిసిందే. ఈ సినిమా విషయంలో సెన్సార్ బోర్డు మీదా కోర్టు వరకు కూడా వెళ్లాడు వెట్రిమారన్. అయితే ఎన్నో వివాదాలు ఎదుర్కోన్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ చెప్పిన పలు కట్‌లకు చిత్రబృందం అంగీకరించడంతో సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చింది బోర్డు. ఈ క్రమంలోనే ఈ చిత్రం విడుదలకు సిద్ధంమైంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ టీమ్ పోస్ట్ పెట్టింది.

స్కూల్ స్టేజీ నుంచే తోటి విద్యార్థులలాగే తనకు ఓ బాయ్‌ఫ్రెండ్ ఉండాలనుకునే ఓ అమ్మాయి కథ ఈ చిత్రం. ఆచారాలు, కట్టుబాట్లు పాటించే కుటుంబంలో పుట్టిన ఈ అమ్మాయి తనకు నచ్చిన వాడిని ఎలా ఏంపిక చేసుకుంది. ఈ క్రమంలో ఆ అమ్మాయి జీవితంలో ఎదురైన సంఘటనలు ఏంటి అనేది ఈ సినిమా కథ. ఏ గ్రాస్ రూట్ ఫిల్మ్ కంపెనీ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.




# ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత మహిళల కాంపౌండ్ జట్టు

**చైనీస్ తైపీతో ఫైనల్ పోరుకు సిద్ధం**

బలగం టీవీ, హైదరాబాద్



స్పెయిన్‌లో జరుగుతున్న 4వ దశ ఆర్చరీ ప్రపంచకప్‌లో భారత మహిళల కాంపౌండ్ జట్టు మరోసారి మెరిసింది. జ్యోతి సురేఖ వెన్నం, ప్రతీక, పర్‌నీత్ కౌర్‌లతో కూడిన భారత త్రయం సెమీఫైనల్లో ఇండోనేషియాను 230–226 స్కోరుతో ఓడించి ఫైనల్ చేరింది. వరల్డ్ కప్ సర్క్యూట్‌లో ఇది భారత మహిళల జట్టుకు వరుసగా రెండో ఫైనల్ కావడం గమనార్హం. ఇందుకు ముందు క్వార్టర్ ఫైనల్లో భారత్ జట్టు ఎల్ సాల్వెడార్‌పై 235–226 తో ఘనవిజయం సాధించింది. ఫైనల్ పోరు జూలై 12న జరగనుండగా, భారత ఆర్చర్లు చైనీస్ తైపీతో తలపడనున్నారు. ఇదిలా ఉండగా, పురుషుల కాంపౌండ్ విభాగంలో భారత్‌కు నిరాశే ఎదురైంది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు ఫ్రాన్స్ చేతిలో 233–234తో ఓటమి పాలైంది. ఈ విజయంతో భారత్‌కు మరోసారి స్వర్ణం దక్కే అవకాశముండగా, జ్యోతి సురేఖ తదితరులు తమ అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తున్నారు.

# 'మహాభారతం'పై అమీర్ ఖాన్ అధికారిక ప్రకటన

**భారీ బడ్జెట్‌తో ఐదు భాగాల సిరీస్**

**భారత సినిమా చరిత్రలో మైలురాయి కావాలని లక్ష్యమయ్యే ప్రాజెక్ట్**

బలగం టీవీ, హైదరాబాద్

ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో మైథలాజికల్ సినిమాలపై ఆసక్తి గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ అమీర్ ఖాన్ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'మహాభారతం' ను అధికారికంగా ప్రకటించారు. ఒక ఆంగ్ల మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన అమీర్, "ఒకే సినిమా ద్వారా 'మహాభారతం' వంటి విస్తృత, లోతైన ఇతిహాసాన్ని పూర్తిగా చెప్పడం సాధ్యం కాదు. అందుకే ఈ ప్రాజెక్ట్‌ను ఐదు భాగాల సిరీస్‌గా రూపొందించబోతున్నాం" అని తెలిపారు. ఈ సిరీస్‌కు ప్రతి భాగానికి రూ.1,000 కోట్ల బడ్జెట్, మొత్తం ప్రాజెక్ట్‌కు



రూ.5,000 కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా. 'అమీర్ ఖాన్ ప్రొడక్షన్స్' తో పాటు కొన్ని అంతర్జాతీయ స్టూడియోలు కూడా ఈ ప్రాజెక్ట్‌కు భాగస్వాములుగా చేరనున్నట్లు సమాచారం.

అలాగే, "ఈ సినిమాలో స్టార్ నటులు ఉండరు. పాత్రలే నిజమైన హీరోలు. పూర్తిగా కొత్త నటులతో మహాభారతాన్ని తెరపైకి తీసుకురావాలనుకుంటున్నాం" అని అమీర్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ సిరీస్ స్క్రిప్ట్ పనులు చివరి దశలో ఉన్నాయి. ప్రముఖ రచయితలు, టెక్నికల్ టీమ్స్ ఇతిహాసాన్ని ఆధునికీకరించడంలో బిజీగా ఉన్నారు. పాత్రల లోతు, సంస్కృతిక విలువలు, ఇతిహాసబద్ధతను నిలబెట్టే విధంగా అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందించనున్న ఈ సిరీస్ ఇప్పటికే బాలీవుడ్‌తో పాటు దక్షిణాది పరిశ్రమల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది.

ఇక అమీర్ ఖాన్ నటించిన చివరి చిత్రం 'సితారే జమీన్ పర్' కు విమర్శకుల ప్రశంసలు, మంచి కలెక్షన్లు లభించాయి. ప్రస్తుతం అది రూ.200 కోట్ల క్లబ్ వైపు దూసుకుపోతుండగా, ఆయన కొత్త ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మహాభారతం సిరీస్ ప్రారంభం ఆగస్టులో మొదలవనున్నట్లు తెలుస్తోంది. ఇది భారత సినీ చరిత్రలో అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా నిలవడం ఖాయం అని విశ్లేషకుల అభిప్రాయం.

# కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో నలుగురు మృతి

బలగం టీవీ, హైదరాబాద్

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి లో జరిగిన కల్తీ కల్లు ఘటన కలకలం రేపుతోంది. కల్లు కాంపౌండ్‌లో కల్తీ కల్లు తాగి మూడు రోజుల్లో నలుగురు మృతి చెందగా.. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. మృతులు సీతారామ్, చాకలి బొజ్జయ్య, నారాయణమ్మగా గుర్తించారు. ఈ మతులంతా హెచ్ఎంటీ హిల్స్ సాయిచరణ్‌కాలనీకి చెందిన వారిగా అధికారులు గుర్తించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిలో జి.దేవవాస్ లోనో్ట్రోప్ మద ్దతుతో డయాలసిస్ చేయించుకుంటున్నారు. మోనప్ప వెంటిలేటర్‌పై ఉండగా.. కృష్ణయ్య డయాలసిస్ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. 23 మందికి పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స అందిస్తున్నారు. వీరిలో 15 మంది మంగళవారం రాగా.. బుధవారం గాంధీ ఆస్పత్రి నుంచి ఇద్దరు, కూకట్‌పల్లి నుంచి మరో ఆరుగురు నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని మినహాయిస్తే మిగతా వారు మూత్ర విసర్జనలో పెరుగుదలతో కోలుకుంటున్నారు. హెమోడైన మిక్‌గా స్థిరంగా ఉన్నారు. నిమ్స్ హాస్పిటల్‌లోని మల్టీ డిసిప్లినరీ నిపుణుల బృందం రోగుల పరిస్థితిని నిషితంగా పర్యవేక్షిస్తున్నట్టు జనరల్ మెడిసిన్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీఎస్.సుబ్బలక్ష్మి తెలిపారు. ఇదిలా ఉంటే.. కల్తీ కల్లు ఘటనలో ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. కల్లు కాంపౌండ్‌లను సీజ్ చేశారు. కల్లు శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేస్తున్నారు.

కూకట్‌పల్లిలోని ఉషా ముళ్లపూడి రోడ్డులో కల్లు కాంపౌండ్, కేపీహెచ్‌బీలోని హైదర్‌నగర్, ఎల్లమ్మబండ ప్రాంతంలోని కల్లు కాంపౌండ్‌లో సాయంత్రం కొంతమంది ఆదివారం కల్లు తాగారు. మరుసటి రోజు ఉదయం నుంచి వారిలో ఒక్కొక్కరిగా అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. దీంతో వారి కుటుంబ సభ్యులు హుటాహుటిన బాధితులను కూకట్‌పల్లిలోని రాందేవ్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ప్రాథమిక చికిత్స అనంతరం నిమ్స్‌కు తరలించారు. కూకట్‌పల్లి కల్తీ కల్లు కేసులో ఐదుగురు నిర్వాహకులను బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కల్లు కాంపౌండ్లు నిర్వహిస్తున్న నగేశ్‌గౌడ్, బి.శ్రీనివాస్‌గౌడ్, టి.శ్రీనివాస్‌గౌడ్, టి.కుమా ర్‌గౌడ్, లీగల రమేష్‌పై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. నిర్వాహకులకు సంబంధించిన ఐదు షాపులను ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు.

**ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిని వదలం : మంత్రి జూపల్లి**

బాలానగర్ స్టేషన్ పరిధిలో కల్తీ కల్లు తాగి పలువురు అస్వస్థతకు గురికావడం అత్యంత బాధాకరమని రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కష్ణారావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఘటన జరిగిన వెంటనే ఎక్సైజ్, పోలీసు అధికారులు స్పందించి హుటాహుటిన వారిని హాస్పిటల్స్‌కు తరలించారని తెలిపారు. సకాలంలో వైద్యం అందడంతో బాధితులందరూ కోలుకుంటున్నారనీ, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. బాధితులుందరూ ఒకే రకమైన లక్షణాలతో భాదపడుతున్నారనీ, ప్రాథమికంగా ఇది కల్తీ కల్లు వల్లే జరిగిందని భావిస్తున్నామని చెప్పారు. ఈ ఘటనపై ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే.. బాధ్యులెంతటి వారైనా వదలబోమని స్పష్టం చేశారు. బాధ్యులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని వెల్లడించారు. కల్లు డిపోలను కూడా సీజ్ చేశారనీ, కల్లు శాంపిల్స్‌ను సేకరించి ఎక్సైజ్ కెమికల్ ల్యాబోరేటరీకి.. చికిత్స పొందుతున్న వారి శ్యాంపిల్స్‌ను ఫోరెన్సి క్ ల్యాబ్‌కు పంపించారనీ, నివేదిక ఆధారంగా బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం తోపాటు కల్లు డిపోల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఇలాం టి ఘట నలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి కల్లు డిపోలపై నిరంతర నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు చెప్పారు. మంత్రి వెంట ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ గంగాధర్, డ్యూటీ డాక్టర్లు ఉన్నారు.